


# పరదేశీ కథలు

## - చిట్టే సిద్ధ లలిత



- 104 -

## రుక్మిణి కథ

"**ఏమయ్యా రామయ్యా..** బాకీ ఎప్పుడు తీరుస్తావు. ఈ రోజు రేపు అని చెప్తూ సంవత్సరం గడిపావు. గడిపావు. వడ్డీ కూడా కట్టకపోతివి. మేమూ బతకాలి కదా. కడుపుకు అన్నం తింటే సరిపోదయ్యా. మనిషి మాట మీద నిలబడాలి."

సూటిగా హృదయాన్ని గుచ్చుతున్న సుబ్బయ్య మాటలకు జవాబు చెప్పలేక తల దించుకున్నాడు. అరుగు మీదినుండి లేచి తువ్వాలు విదిలించి భుజాన వేసుకుని చక్కా ఇంటికి పోయాడు రామయ్య.

రోజంతా సుబ్బయ్య మాటలే చెవుల్లో గింగురుమంటున్నాయి. ఇటు చూస్తే పరువు, అటు చూస్తే కరువు. ఐదేళ్ళనుండీ పంటలు పండక అప్పులు కుప్పల్లా పెరిగిపోయి వడ్డీలు భయపెడుతున్నాయి. ఊపిరాడక, దిక్కుతోచక చావే శరణ్యమనుకుని పురుగుల మందు కొని తెచ్చుకున్నాడు.

పెళ్ళాన్ని, బిడ్డలను చూస్తూ కన్నీళ్ళతో కుమిలిపోతూ పురుగు మందు డబ్బా మంచం కింద దాచుకుని ముసుగేసుకుని పడుకున్నాడు.

అతని బాధ భార్యకు అర్థమయ్యింది. ఇరవై యేళ్ళుగా రామయ్యతో కాపురం చేస్తున్న ఇల్లాలు ఆమె. అన్నం తినకుండా పడుకున్న భర్త ఆలోచన గ్రహించలేని అవివేకి కాదు. మంచం కింది పురుగుల మందు డబ్బా ఆమె కంట పడింది. దాన్ని చేత పట్టుకుని గొల్లుమని ఏడ్చింది. పెద్ద బిడ్డ రుక్మిణి, చిన్న బిడ్డ శైలజ అమ్మ ఏడుపు విని పరిగెత్తుకొచ్చారు.విషయం అర్థమయి తల్లితో కలిసి భోరుమని ఏడ్చారు. ఏడుపులు విని రామయ్య పైకి లేచాడు.

"ఏడవకండి. అప్పుల బాధలు భరించడంకంటే చచ్చేది మేలు కదా" అన్నాడు.

పెద్దబిడ్డ రుక్మిణికి కోపం వచ్చింది. "నువ్వు చస్తే మేము ఏమయి పోవాల నాయనా. మేము లేమా, బాకీలు తీర్చలేమా? నేను కోయేటికి పొయ్యి నీ అప్పులన్నీ తీర్చేస్తాను. నువ్వు భయపడగాకు, బాధపడగాకు, లేచి అన్నం తిను" అనింది రోషంగా.

"ఆడపిల్లను కొయేటికి పంపించే బతుకు ఎందుకమ్మా. ఊరి జనాలు ఏమనుకుంటారు" వాపోయాడు రామయ్య.

"ఎవరో ఏదో అనుకుంటారని మనం పురుగులమందు తాగి చచ్చిపోదామా నాయనా?వాళ్ళు మన అప్పులు తీరుస్తారా? అన్నం పెడతారా. మన కుటుంబం బాగుండటమే మనకు కావాలి. కువైట్ వెళ్ళేది కష్టపడి పని చేసుకుని డబ్బు సంపాదించడానికే కదా. వెళితే తప్పేముంది? పని చేసుకుని బతికితే అందులో పరువు పోయేదేముంది. నేను మగపిల్లాడిని నీ కొడుకుని అనుకో" అంటూ నచ్చచెప్పింది రుక్మిణి.

ఒప్పుకోక తప్పలేదు రామయ్యకు.

అప్పటికప్పుడు ఇంట్లో వున్న బంగారు కుదువ పెట్టి పదివేలు తెచ్చి పాస్పోర్టు చేయించారు. తరువాత వీసా కోసం ఏజెంటు రఘు దగ్గరికి పోయారు.

రుక్మిణిని చూడగానే ఏజెంట్ రఘు పాస్ పోర్టు కాపీలను సంతోషంగా తీసుకున్నాడు.

"తొందరగా వీసా చూస్తా దగ్గరుండి విమానం ఎక్కిస్తా" అన్నాడు పళ్ళికిలించి నవ్వుతూ.

ఎందుకో రామయ్యకు రఘు ప్రవర్తన నచ్చలేదు. అతనిని నమ్మబుద్ధి కాలేదు. ఆ మాటే చెప్పాడు రుక్మిణితో.

"ఏం లేదులే నాయనా. ఏజెంట్లందరూ అలాగే నవ్వుతూ హుషారుగా వుంటారు. వాళ్ళ వృత్తే అది. మనకు పని జరిగితే చాలు" అంది.

అప్పట్నుంచీ రఘు ఏదో ఒక వంకతో రుక్మిణితో మాట్లాడటానికి ఇంటికి వచ్చేవాడు. రామయ్యకు వాడంటే ఇష్టం వుండేది కాదు.

రుక్మిణికి వాడితో మాట్లాడక తప్పేది కాదు.

ఏమంటే.. ఏవో సంతకాలు అవసరం అనేవాడు. అక్కడ సేటుకు ఫోటోలు కావాలి అని చెప్పేవాడు.

"ఓమ్మీ రుక్మిణీ వీసా వచ్చే లోపల బాగా తిని కొంచెం కండ పట్టి మనిషిలా కనబడాలి నువ్వు" అనేవాడు నవ్వుతూ.

నెల రోజుల తరువాత వీసా వచ్చింది. మెడికల్ కు మద్రాసుకు పోవాలి అని తయారై వచ్చాడు.

"రుక్మిణిని ఒక్కదాన్నే పంపించను" అన్నాడు రామయ్య.

"ఓయ్యా.. పెద్దాయనా బాగుండావే నువ్వు. కోయేటికి కూడా వెంట పోతావా ఏమి? ఎంతమంది ఆడోళ్ళకి నేను మెడికల్ చేపియ్యలేదు, విమానం ఎక్కియ్యలేదు. నీకయితే కొత్తనుకో. ఇలా అయితే ఆయమ్మి కొయేటు పోయినట్లే" అన్నాడు ఎగతాళిగా.

"సరేలే మద్రాసుకు మాత్రం వస్తాను పద" అన్నాడు రామయ్య.

"సరే రా పోదాం" అని ముగ్గురూ మద్రాసు పోయినారు.

అక్కడ వాడు రుక్మిణితో అసభ్యంగా ప్రవర్తించసాగాడు. రుక్మిణి రోషమున్న బిడ్డ. ఇలాంటివి సహించదు.

లాగి పెట్టి వాడి చెంప మీద కొట్టింది.

తరువాత ఏమి జరిగిందో తెలియదు గానీ రఘు ఒకదారిన, రామయ్య, రుక్మిణి మరొక దారిన బస్సులో ఇంటికి వచ్చినారు. ఇక ఊర్లోని జనాలకు ఏం తెలిసిందో ఏమో రకరకాలుగా మాట్లాడుకోవడం ప్రారంభించారు.

ఒక ఆడపిల్లను ఎలాంటి మాటలు అనాలో అన్నీ అన్నారు. రామయ్య ఇంకా దిగులు పడినాడు.

"నువు కొయేటికి పోవద్దు బిడ్డా. వున్న పొలం అమ్మేసి అప్పులు తీర్చేస్తా. మిగిలినదాంతో నీ పెళ్ళి చేస్తా అన్నా డు."

వినలేదు రుక్మిణి.

"వున్న పొలం అమ్మితే ఏం తిని బతుకుతారు నాయనా" గట్టిగా ప్రశ్నించింది.

"ఇప్పుడు పొలం వుండి కూడా ఏం తింటున్నాం? ఏ పూటకాపూట చద్దినీళ్ళే గతి కాదా" జవాబు చెప్పాడు రామయ్య.

పట్టుదల కలిగినది రుక్మిణి. అంత సులభంగా ఓటమి ఒప్పుకోదు.

అందుకే ఆమె తీరు చూసిన రామయ్య నువ్వు కొడుకై పుట్టి వుంటే నాకు బాధ లేకపోవును అంటుంటాడు.

ఇప్పుడు ఆడపిల్లనయితే ఏమయింది నాయనా? నేనే కొడుకుననుకో అంటుంది రుక్మిణి.

వెంటనే పాస్పోర్ట్ తీసుకొని రాజంపేటలో వున్న ఏజంట్ ఖాసిం దగ్గరికి పోయి జరిగిన సంగతి చెప్పింది.

స్వతహాగా ఒకే వృత్తి కాబట్టి వాడికీ రఘుకు పడదు. అందుకే రుక్మిణి సమస్యకు స్పందించి వెంటనే "దిగులు పడకు పరిష్కారం చూస్తా, నిన్ను కువైట్ విమానం ఎక్కిస్తా" అన్నాడు.

అన్నట్లుగానే ఒక పెద్ద మనిషిని రఘు వద్దకు పంపి కావాల్సిన డబ్బు తీసుకుని రుక్మిణికి ఆ కువైట్ వీజా ఇమ్మని లేకపోతే కొత్త వీజా తెప్పిస్తానని ఆ వీసా వేస్ట్ అవుతుందనీ చెప్పి పంపించాడు.

డబ్బు వస్తుంది అనగానే మెత్తబడ్డాడు రఘు. అందులో వీసా డేట్ ఎక్స్పైరీ అయితే కష్టం అంతా వ్యర్థమవుతుంది. అందులో ఖాసిం అంటే వుండే భయం వలన వీసా ఇచ్చేసాడు.

ఇది రఘుకు తనకు మధ్య పరువు సమస్య కావడంతో ఇందుకు అవసరమైన డబ్బంతా ఖాసిమే పెట్టుకుని ఏర్పాట్లు పూర్తి చేసాడు.

కొయేటు పోయాక సంపాదించి ఖర్చు చేసిన డబ్బు పంపించమన్నాడు. "సరే అన్నా.. నీ ఋణం వుంచుకోను. బహుత్ షుక్రియా" అంది రుక్మిణి ఖాసింకు నమస్కరిస్తూ.

మంచి చెడు పక్కపక్కనే వుంటాయి. మనం వెతికి పట్టుకోవాలి అంతే.

అన్ని పనులూ పూర్తయి ఎట్టకేలకు విమానం ఎక్కింది రుక్మిణి. కళ్ళలో నీళ్ళు పొంగుకొచ్చాయి.
భూమిని నమ్ముకున్న పేద రైతుగా నాయన, కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశంతో ఒక ఆడపిల్లగా తను పడిన కష్టాలు, సంఘర్షణ తలచుకుంటే దు:ఖం ఆగలేదు లోకం తీరుపై కసి పుట్టింది.
ఎదగాలి, డబ్బు సంపాదించాలి అనే పట్టుదల ఆ అమ్మాయిలో కలిగింది.

కానీ ఏదైనా అనుకున్నంత సులభం కాదు. కాలం కలిసి రావాలి. విధి రాతను తప్పించుకోలేము. సేటు ఎయిర్ పోర్టుకు వచ్చి కార్లో ఇంటికి తీసుకు పోయాడు. ఇంద్ర భవనం లాంటి ఇల్లు. ఆరుగురు పిల్లలు. నలుగురు పని మనుషులు. ఇద్దరు డ్రైవర్లు. ముట్టుకుంటే మాసిపోయేట్లు వుంది ఇల్లు. సంబరపడింది రుక్మిణి.
కానీ ఇక్కడ పని చెయ్యడం అంత సులభం కాదు. అక్కడ ఇండియాలో పొలం పని చేసినా అలసట వచ్చేది కాదు. ఇక్కడ పొద్దున్నే లేవాలి. తుడిచిందే తుడవాలి. బాత్రూములన్నీ రోజూ కడగాలి. ఇల్లంతా రోజూ వాక్యూంతో శుభ్రం చేయాలి. దువానియా, హాలులోని కార్పెట్లు, సోఫాలు, కుర్చీలు బ్రష్ తో తుడవాలి. వచ్చే గెస్టులకు నీళ్ళు, జ్యూస్ లు, కాఫీలు, టీలు, అరబిక్ గహ్వాలు అందించాలి.
కొంచెం సమయం వుంటే వంట గదిలో కూరలు, సలాడ్స్ తరిగి సహాయం చెయ్యాలి. ఒక్క క్షణం కూడా కూర్చోకుండా రోజంతా నిర్విరామంగా పని చెయ్యాలి. మధ్యాహ్నం కాస్త అన్నం తిన్నాను అనిపించేది అంతే. వళ్ళు నొప్పులతో అలసట కమ్ముకునేది. ఇక ఊపిరాడక భరించలేనురా తండ్రీ రక్షించు అంటూ ఏడ్చే స్థితికి వచ్చింది రుక్మిణి.
పని ఎక్కువ. ఒకపూట తినే తిండి సరిపోయేది కాదు. వంటికి పట్టేది కాదు. అలసి సొలసి కాస్త తింటే వికారంతో కడుపులో పడిందంతా వాంతి అయ్యేది.
అలా వాంతి చేసుకుంటుంటే శ్రీలంక వంట మనిషి చూసి "ఎవరితో తప్పు చేసావో చెప్పు.
మామా బాబాకు తెలిస్తే చంపేస్తారు" అంటూ బెదిరించింది.
అది ఏమంటుందో అర్థంకాక బిక్కమొహం వేసింది రుక్మిణి.
"మాఫీ షై.. మాఫీ షై" అంది వచ్చీ రాని అరబ్బీలో. అంటే అలాంటిదేమీ లేదు అని అర్థం.
కానీ అది దుర్మార్గురాలు. రాక్షసి.వెళ్ళి మామాకు చెప్పింది.అప్పట్నుంచీ ఆ ఇంట్లో నరకం మొదలయ్యింది.
ఎవడితో మాట్లాడుతోందో అని రుక్మిణి మీద నిఘా పెట్టారు.
నిప్పులమీద నడకలా వుంది పరిస్థితి.

అప్పటికీ అన్నిటినీ పంటి బిగువున ఓర్చుకుంటోంది.
శ్రీలంక వంట మనిషిలో క్రూరత్వం వుండేది. మామా బాబాకు పనిమనుషుల మీద ఎప్పుడూ ఏదో ఒక చాడీలు చెప్పేది.
మామా బాబా మంచివాళ్ళే కానీ దాని మాటలు వినేవాళ్ళు. నాయన చేసిన అప్పులను, కుటుంబంలోని కష్టాలను, తను కువైట్ కు వచ్చిన అవసరాన్ని గుర్తు చేసుకుంటూ లేని శక్తిని అరువు తెచ్చుకుంటూ రోజులు గడప సాగింది రుక్మిణి.

కువైట్ వచ్చి మూడ్నెల్లు గడిచాయి. ఖాసిం అప్పు తీర్చేసింది. ఆ ఇంట్లో అన్నీ ఎలా వున్నా జీతం మాత్రం ఖచ్చితంగా నెలాఖర్లో ఇచ్చేవాళ్ళు. అదో ఊరట. అందుకే కదా ఇంత దూరం పరదేశానికి వచ్చింది.
ఇంకో ఆర్నెల్లు కష్ట పడితే కొన్ని అప్పులు తీర్చవచ్చు. ఒక సంవత్సరం గడిస్తే నాయన చేసిన అప్పులన్ని తీరి గడ్డన పడచ్చు. రెండేళ్ళు పని చేసి ఇంటికి పోవాలి. తరువాత ఈ కువైట్ కి తిరిగి రావద్దు అని నిట్టూర్చింది రుక్మిణి.

ఎవరో పిలుస్తున్నారన్నట్లు రోజులు హడావుడిగా కదిలి పోతున్నాయి. ఓపిక కావాలి. రోజు రోజుకూ కొత్త శక్తిని బలవంతంగా వంట్లో నింపుకుంటూ పని చేస్తోంది రుక్మిణి. ఈ మధ్య కాలంలో పిల్లలు బాగా దగ్గరయ్యారు. రుక్మిణి అంటే ఇష్టం చూపుతూ చిన్నపిల్లలు పరిగెత్తుకుంటూ వచ్చి ఆప్యాయంగా అల్లుకునేవారు. రుక్మిణితో ఆడుకుంటామని మారాం చేసేవారు. నిష్కల్మషమైన వారి ప్రేమ రుక్మిణికి అంతులేని శక్తిని, ఓపికను ఇచ్చేది.
మరో ఆర్నెల్లు గడిచాయి. అప్పులు దాదాపూ తీరాయి. ఇక సంపాదించే డబ్బుతో అమ్మానాన్నలను సుఖపెట్టాలి. వారి కోరికలు తీర్చాలి అని నిశ్చయించుకుంది రుక్మిణి. కష్టమైనా సహిస్తూ మరింత ఉత్సాహంగా పని చెయ్యసాగింది.

ఒకరోజు మామా చెల్లెలు తన పిల్లలతో అక్క ఇంటికి వచ్చింది. ఈ పిల్లలు ఆ పిల్లలు కలిసి గోల చేస్తూ బయట తోటలో ఆడుకోసాగారు. వారిని ఆడించే బాధ్యత రుక్మిణిదే. చిన్నపిల్లలతో చాలా జాగ్రత్తగా వుండాలి. కువైట్ వాళ్ళకు పిల్లలంటే ప్రాణం. స్త్రీలు కుటుంబ నియంత్రణ లేకుండా ముసలివాళ్ళయినా సరే కంటూనే వుంటారు.
"అల్లా ఇస్తున్నాడు కాబట్టి ఆపరేషన్ చేయించుకుని, పుట్టే బిడ్డలను ఆపకూడదు. అది తప్పు. అలా చేస్తే నరకానికి పోతాం. ఆడవాళ్ళుగా పుట్టిందే బిడ్డలను కనడానికి. సృష్టిని తయారు చేయడానికి" అంటారు.
అలాగే పిల్లలను అపురూపంగా అల్లారుముద్దుగా పెంచుతారు. వారికి చిన్న గాయమైనా సహించరు. ఏదో ఆలోచనలో గమనించలేదు కానీ రెండేళ్ళ చిన్నోడు హసన్ పరిగెత్తుతూ రోడ్ మీదకు వెళ్ళిపోతున్నాడు.

చూసి వెనకే పరిగెత్తింది రుక్మిణి.

ఇంతలో లోపలికి దూసుకొచ్చింది బాబా కారు. ఒక్క క్షణం ఆలశ్యం అయితే హసన్ కారు కింద పడేవాడే.

రుక్మిణి పరిగెత్తి పిల్లోడ్ని చేతుల్తో చుట్టి అవతలికి తోసింది. కానీ తాను తప్పించుకోలేకపోయింది.

కాళ్ళు రెండూ టైరు కిందపడి విరిగాయి. బాబా నిర్ఘాంతపోయాడు. తన కారుతో తనే ఏక్సిడెంట్ చేయడం ఆయనను షాక్ లోకి నెట్టింది. ఇంతలో అందరూ అక్కడికి పరిగెత్తుకొచ్చారు.

మామా హసన్ ను ఎత్తుకుని నీకేం కాలేదుగా కన్నా అంటూ గుండెలకు హత్తుకుంది. ఆ తరువాత ఆ పక్కనే రక్తపు మడుగులో పడి వున్న రుక్మిణిని చూసారు. వెంటనే అదే కార్లో రుక్మిణిని వేసుకుని అల్ రాజి హాస్పిటల్ కు తీసుకెళ్ళారు. డాక్టర్లు ఎన్నో ప్రయత్నాలు చేసారు. ఆర్నెల్లు అక్కడే వుంచి ఆపరేషన్లు చేసారు. కానీ కాళ్ళు నయం కాలేదు. నడవడానికి కుదరలేదు. రుక్మిణి చక్రాల కుర్చీకే పరిమితం అయ్యింది.

ఆ సమయంలో రుక్మిణి పడిన బాధకు ఆ ఎడారి కూడా కన్నీళ్ళు కార్చింది. ఆమె కన్నీళ్ళకు చలించి అరేబియా సంద్రం దు:ఖించింది. కాళ్ళు తిరిగి రావాలని, మునుపటిలా తిరిగి నడవాలని కోరుకుంటూ వేల దేవతలకు మొక్కింది రుక్మిణి. కృంగిపోయింది. ఏ దేవతా ఆమె మొర వినలేదు.

మామా బాబా చిన్నారి హసన్ ను కాపాడి తన కాళ్ళు పోగొట్టుకున్న రుక్మిణికి కృతజ్ఞతలు తెలియజేసారు. డాక్టర్లతో మాట్లాడి మంచి ట్రీట్మెంట్ ఇవ్వమని అర్థించారు. వారానికి ఒకసారి వచ్చి చూసి ధైర్యం చెప్పి వెళుతున్నారు. చివరికి డాక్టర్లు ఫిజియో థెరపీలతో కొంచెం ఉపయోగం వుండచ్చని, నెమ్మదిగా మార్పు రావచ్చని అందుకు కొన్ని సంవత్సరాలు పట్టచ్చని చెప్పి డిశ్చార్జ్ చేసారు. కదలని కాళ్ళను చూసుకుని కుమిలిపోయింది రుక్మిణి.

"నువు బాధ పడవద్దు. నీ ట్రీట్ మెంట్ కి, నీ జీవితానికి సరిపోయేంత డబ్బు మేమిస్తాము. నువ్వు ఇండియాలోని నీ ఇంటికి పోవాలంటే నిన్ను విమానంలో పంపిస్తాము. ఇక్కడే వుంటాను అంటే నీ ఇష్టం వచ్చినట్లు వుండు. నిన్ను చూసేందుకు ఒక మనిషిని పెడతాం" అన్నారు.

తల్లిదండ్రులు గుర్తొచ్చి దు:ఖించింది రుక్మిణి. "ఇంటికే వెళతాను" అని చెప్పింది.

తరువాత ఏర్పాట్లు త్వరగా పూర్తయ్యాయి. మామా బాబా మంచివాళ్ళే. సహజంగా అరబ్బీలకు దయా హృదయం వుంటుంది. మామా బాబా దగ్గరుండి రుక్మిణిని జాగ్రత్తగా విమానం ఎక్కించారు. రుక్మిణి ఊహించనంత డబ్బును ఆమె బ్యాంకులో వేసారు. జీవితంలో ఎప్పుడు ఏ అవసరం వచ్చినా ఫోన్ చెయ్యమని చెప్పి భారంగా వీడ్కోలు చెప్పారు.

ఆరోజు జరిగిన ఏక్సిడెంట్ గుర్తొస్తే వళ్ళు జలదరించింది రుక్మిణికి. తన కాళ్ళు పోతే పోయాయి అదే చిన్నారి హసన్ కు ఏమైనా జరిగి వుంటే? ఆ ఊహకే కన్నీళ్ళు వచ్చాయి.ఆ రోజు చిన్నారి హసన్ కు చిన్న గాయమయినా ఈ రోజు రుక్మిణి ప్రాణాలతో ఇండియా కు వచ్చేది కాదు. తనకు కాళ్ళు పోయినా పరవాలేదు కానీ హసన్ ప్రాణాలు రక్షించినందుకు సంతోషించింది రుక్మిణి

కూతురు కాళ్ళకు కట్లు కట్టుకుని వీల్ చైర్ తో ఊళ్ళోకి రావడంతో రుక్మిణి అమ్మ నాన్న గగ్గోలు పెట్టి ఏడ్చారు. విషయం తెలిసిన ఊరి జనం "అయ్యో.. పెళ్ళి కావాల్సిన బిడ్డ అనవసరంగా కువైట్ పోయింది కష్టాలు కొని తెచ్చుకుంది" అని బాధ పడ్డారు.

వారిలో కొందరు "కాళ్ళు పోతే పోయాయి కువైట్ సేట్లు కోట్ల డబ్బును ఇచ్చారట ఇంకేం" అన్నారు.

కలలో కూడా చూడనంత డబ్బు దొరికింది కానీ బిడ్డ రుక్మిణి అవిటిదయిందని బాధ పడే రామయ్యను ఎవరూ ఓదార్చలేక పోయారు.

బ్యాంకులో వున్న డబ్బుతో మంచి ఇల్లును కట్టించింది రుక్మిణి. చెల్లిని బాగా చదివించింది. అమ్మనాన్నలకు అన్ని సౌకర్యాలూ కల్పించింది. ఆ విధంగా పేదరికం పారిపోయింది. ట్రీట్ మెంట్ జరుగుతోంది. ఈ మధ్య తనకు తానే లేచి నిలబడి ఇప్పుడిప్పుడే నడక నేర్చిన పాపాయిలా నాలుగడుగులు వేస్తోంది రుక్మిణి.

సంతోషించారు తల్లిదండ్రులు ఫిజియో థెరపీతో, మందులతో త్వరలో కోలుకుని తిరిగి తమ బిడ్డ ఇంట్లో మహాలక్ష్మిలా నడుస్తుందనే ఆశతో జీవిస్తున్నారు వాళ్ళు.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments